# తెలుగు టీవీ వచ్చేసింది



సంక్రాంతి నుంచీ తెలుగు టీవీ ప్రసారాలు రాష్ట్రమంతటా రిలే' అన్న వార్త పేపర్లో కనిపించేసరికి మా కాలనీలో ఎక్కడ లేని హడావుడీ మొదలయింది.

అప్పటికప్పుడే- ఆ రోజు సాయంత్రం కాలనీ మీటింగుందని కాలనీ అంతా ప్రకటనలు చేయటం మొదలు పెట్టాడు శాయిరామ్.

"సంగతేమిటి?" అనడిగాను శాయిరామ్ మా ఇంటికొచ్చినపుడు.

"ఏమిటేమిటి? తెలుగు ప్రోగ్రామ్ తెలుగుదేశమంతటా విస్తరిల్లుతోంటే మనం మనకేమీ పట్టనల్లు కూర్చుంటామా? మనవంతు కళాపోషణ మనం కూడా చేయాలి!" వస్తా! ఇప్పటికే ఆలస్యమయిపోయింది" అని బయటకు పరుగెత్తాడు.

సాయంత్రం ఏడింటికి కాలనీ వేదిక దగ్గర మీటింగ్ మొదలయిపోయింది. ఆడా, మగా, పిల్లా, పీచూ అంతా చాలా ఎగ్జయిటింగ్‌గా ఉన్నారు.

"సోదర సోదరీమణులారా! ముక్కు పచ్చలారని ముద్దు బిడ్డలారా! కొంచెం పచ్చబడిన విద్యార్థులారా!" అన్నాడు శాయిరామ్. వెనుకనుంచీ ఎవరో "హ్హాహ్హాహ్హా" అని నవ్వటం వినిపించింది.

"నీకదే వద్దని చెప్పాను! డైరక్ట్‌గా సబ్జెక్ట్‌లో కొచ్చేసెయ్" అన్నాడు రంగారెడ్డి శాయిరామ్‌ని తొందరపెడుతూ.

"త్వరలో తెలుగు టీవీ కార్యక్రమాలు మన రాష్ట్రమంతా విస్తరిస్తున్నాయ్. కనుక ఈ

సందర్భంలో హిందీలో వస్తోన్న టీవీ సీరియల్స్ లాగానే తెలుగులో కూడా మంచి స్టాండర్డ్ సీరియల్ ఒకటి వస్తే బావుటుందన్న ఆలోచన నాకు కలిగింది."

"అబద్ధం! ఆ అయిడియా చెప్పింది నేను" అన్నాడు చంద్రకాంత్ ఛటోపాధ్యాయ్ ఓ మూలనుంచీ! శాయిరామ్ గతుక్కుమన్నాడు.

"అవును మర్చిపోయాను. ఆ అయిడియా మా ఇద్దరిదీ! మన కాలనీలో ఉన్న టాలెంట్స్‌తో మనమే టీవీ సీరియల్ తీసి తెలుగు ప్రజలకు సమర్పించాలని మిగతా చాలామంది సభ్యులు కూడా కోరటం వల్ల– ఈ సమావేశం ఏర్పాటు చేశాము."

"అవునూ? తీద్దాం! తీద్దాం!" అని అరిచారు పిల్లలు చాలామంది ఉత్సాహంగా.

"ఈ విషయంలో పరిజ్ఞానం ఉన్నవాళ్ళు తమ తమ విలువలయిన సలహాలు అందజేస్తారని ఆశిస్తున్నాం" అని అన్నాడో లేదో అందరూ వేదికమీదకు ఎగబడ్డారు. మా కమిటీ సభ్యులు అరడజను మంది తప్ప.

అతి కష్టం మీద వాళ్ళందరినీ కంట్రోల్ చేసి వెనక్కు పంపించి వేశాము.

రంగారెడ్డి మైకు అందుకున్నాడు.

"నన్నడిగితే పెద్దాళ్ళ వినోదం కోసం సినిమాలతో సహా ఎన్నో రకాల అనేక సాధనాలున్నాయ్. పిల్లలకు మాత్రం ఎలాంటి సౌకర్యాలూ మనం సమకూర్చలేక పోతున్నాం. గనుక మనం పిల్లల టీవీ సీరియల్ తీద్దాం".

అతని మాట పూర్తయిందో లేదో పిల్లలంతా పెద్ద ఎత్తున అరుపులు కేకలు వేయసాగారు.

"మాకు పిల్లల సీరియల్ వద్దూ! మాకొద్దూ! పిల్లల ద్రోహి రంగారెడ్డి డౌన్ డౌన్! మాకు పెద్దోళ్ళ సీరియల్సే కావాలి 'ఏ' సర్టిఫికెట్ సీరియల్సే కావాలీ..."

నేనూ, గోపాల్రావ్, యాదగిరీ వెళ్ళి వాళ్ళందరినీ పిల్లల సినిమా గానీ, టీవీ సీరియల్‌గానీ ఎట్టి పరిస్థితుల్లోనూ తీయమని ప్రామిస్‌చేసి సమాధాన పర్చాక గొడవ సద్దుమణిగింది.

"పోనీ మనం డిటెక్టివ్ సీరియల్స్ తీద్దాం! కథ రడీగా ఉంది" అంది రచయిత్రి రాజేశ్వరి.

"మన దేశంలో డిటెక్టివ్ సీరియల్స్ ఏమిటి నా తలకాయ్! మనదేశమంతా వెతికినా ప్రైవేట్ డిటెక్టివ్‌లు ఒకరిద్దరు కంటే ఎక్కుమందిలేరు–" అన్నాడు గోపాల్రావ్ అడ్డుచెప్తూ.

"అదే వెరయిటీ అంటే! నేను రాయబోయే డిటెక్టివ్ నవల "చీకట్లో శవం" అయితే టీవీ సీరియల్‌కి చాలా బ్రహ్మాండంగా ఉంటుంది. అందులో హీరో అర్ధరాత్రి లైట్ స్విచ్ వేసేసరికి కరెంటు ఉండదు. చీకట్లో తడుముకుంటూ రెండడుగులు వేసేసరికి..."

"కాళ్ళకు చల్లగా తగులుతుంది. శవం! అదే చీకట్లో శవం!" అంటూ ఓ స్టూడెంట్ అరచాడు.

"ఇలా ముందే మీరు కథ చెప్పేస్తే నేను దిగిపోతాను–" అందామె కోపంగా.

"దిగమనేగా మేమూ అడిగేది?"

ఆమె కోపంగా దిగివెళ్ళి పార్వతీదేవి పక్కన కూర్చుంది. చంద్రకాంత్ ఛటోపాధ్యాయ్ మైకు దగ్గరకొచ్చాడు.

"నన్నడిగితే ఫామిలీ సెంటిమెంట్ సీరియల్ అయితే బాగుంటుంది. నేను ఒక స్టోరీ ఇప్పటికిప్పుడే ఆలోచించాను. హీరో జమీందారు. అతను ఒకామెను మోసం చేసి వదిలేశాడు. ఆమెకు పుట్టిన అమ్మాయిని తనేలాగేసుకుంటాడు. తరువాత ఆ అమ్మాయికా విషయం తెలిసి తల్లిదగ్గర కెళ్తుంది. అక్కడినుంచీ యమ డ్రామా–"

"హెూ!" అని అరిచారు స్టూడెంట్స్ "అది ఇప్పుడు వస్తోన్న హిందీ సీరియల్ కథ…"

చంద్రకాంత్ పక్కకు తప్పుకున్నాడు గొణుక్కుంటూ "హిందీ సీరియల్ అయితే వీళ్ళ సొమ్మేంపోయిందో?"

"సోదర సోదరీమణులారా? కామెడీ సీరియల్ మాత్రమే తీయాలని నా కోరిక. మనం కష్టాలను మర్చిపోయి హాయిగా నవ్వుకోవాలంటే హాస్యం సీరియల్స్ ఉంటేనే బావుటుంది!" అన్నాడు వెంకట్రావ్.

"అవునవును– కామెడీ సీరియల్ కావాలి?" అరచాడు వివిన్‌పాల్.

వెంకట్రావ్‌కి ఉత్సాహం పుట్టుకొచ్చింది.

"మొన్న అదేదో సినిమాలో కూడా చూశాను. హీరోయిన్ పడుపు వృత్తి చేస్తుందన్నమాట! మంచం క్రింద ఒక ప్రియుడిని దాక్కోబెట్టి ఇంకో ప్రియుడితో సరసాలు చేస్తూంటుంది. ఈలోగా ఇంకో ప్రియుడొస్తాడు. ఈలోగా హీరోయిన్ గుడ్డి తండ్రివస్తాడు. ప్రియులతో ఆమె సరసాలాడుతూ ఉంటుంది గానీ గుడ్డి తండ్రికి తెలీదు. ఏమిటా శబ్దాలు అనడిగితే పిల్లో కుక్కో వచ్చిందని చెప్తుంది. అబ్బ! కడుపుబ్బిపోయింది నవ్వి నవ్వి, కామెడీ అంటే అదీ"

అన్నాడతను నవ్వాపుకుంటూ. ఒక్కరు కూడా నవ్వకపోగా సీరియస్‌గా అందరూ తనవంకే చూస్తూండటం గమనించి ఛటుక్కున స్టేజ్ దిగి జనంలో కలసిపోయాడు వెంకట్రావ్.

చివరకు చంద్రకాంత్ ఛటోపాధ్యాయ్, రాజేశ్వరి, పార్వతీదేవి, గోపాల్రావ్‌లతో ఓ కమిటీని వేయటం జరిగింది. వాళ్లు నలుగురూ కలసి టీవీ సీరియల్ కోసం స్క్రిప్ట్ తయారుచేయాలి.

ఆ స్క్రిప్ట్‌ని టీవీ అధికారులకు సబ్మిట్ చేయటం, వాళ్ళ ఆమోదం పొందటం – ఆ కార్యక్రమమంతా నేనూ రంగారెడ్డి, యాదగిరీ, జనార్ధన్ జరిపించాలి!

"ఇంకో సంగతి! ఆ టీవీ సీరియల్ షూటింగంతా మన కాలనీలోనే జరగాలి. మన

కాలనీవాళ్ళే అందులో నటించాలి! బయటివాళ్ళకు ఛాన్సివ్వటానికి వీల్లేదు" అన్నాడు జనార్దన్ కండిషన్ పెడుతూ.

దానర్థం జనార్ధనే హీరో అని మాకు తెలిసిపోయింది. ఆదిలోనే హంసపాదు ఎందుకని అప్పటికా టాపిక్ వదిలేశాం.

వారం రోజుల్లో మేము చాలా పని చేసేశాం. అందరం కలసి టీవీ ఆఫీస్‌కెళ్ళి సీరియల్ తీసేందుకు అవసరమయిన గైడ్‌లైన్స్ తీసుకుని చూశాము.

దాని ప్రకారం 13 వారాల సీరియల్ వాళ్ళకు ఇవ్వాలి.

ఆ సంగతి తెలుస్తూనే చంద్రకాంత్ చిరాకు పడిపోయాడు.

"కానీ మేము తీసుకున్న సబ్జెక్ట్ ప్రకారం– కథ వారానికి ఇరవై రెండు నిమిషాలు చొప్పున ఎనిమిది వారాల కంటే ఎక్కువ రాదు. ఎలా ఇప్పుడు?" అన్నాడు అయోమయంగా టీవీ అధికారితో.

"ఏమో! ఎలాగోలా 13 వారాలు రావాలి ఆ సీరియల్!"

"అసలీ! 13 వారవాలేమిటి? 10 వారాల సీరియల్ గానీ 6 వారాల సీరియల్‌గాని మూడు వారాల సీరియల్ గానీ ఎందుకుండకూడదు?" కోపంగా అడిగాడీతను.

"అలా ఎందుకు రూల్ పెట్టారో ఆఖరికి గవర్నమెంట్‌క్కూడా తెలీదు. అయినా అది మనకనవసరం! కథ ఒక వారంకే సరిపోయినా దానిని మనం 13 వారాలకు సాగదీయాలి, ఒకవేళ ఇది చాలా బాగుంది గనుక ఇంకొంచెం పెంచవచ్చునని మేము అనుమతి ఇస్తే– దానిని మరో పదమూడు వారాలు సాగదీయాలి. ఇంకా బాగుందనిపిస్తే ఇంకో ఇరవై ఆరువారాలు సాగదీయాలి!"

"అలా చిన్న కథలో అడ్డమయిన చెత్తా నింపి సాగదీస్తే ఎవరు చూస్తారండీ?" ఆశ్చర్యంగా అన్నాడు రంగారెడ్డి.

టీవీ అధికారి మమ్మల్నందరినీ చూసి నవ్వుకున్నాడు.

"ఎవరేమిటండీ! జనం ! ఎవడికోసం చూడరు? వాళ్ళు ఫ్రీగా చూస్తోంది కాకుండా వాళ్ళ టేస్ట్‌కి తగ్గట్టుకూడా సీరియల్ వుండాలంటే ఎవడిస్తాడు? అయినా జనం సంగతి మీకెందుకయ్యా! మీ పని మీరు చూసుకోండి. ప్రతోడూ జనాన్ని ఉద్ధరిస్తామని బయల్దేరేవాడే!" అంటూ గొణిగాడతను.

అందరం బయటికొచ్చాము. మేము "నిర్భయ్ నగర్ ప్రొడక్షన్స్" అని ఓ బానర్ రిజిస్ట్రేషన్ చేసే లోపల చంద్రకాంత్ వాళ్ళు స్క్రిప్టు రాయటం రడీ చేసేశామన్నారు.

"కానీ అందులో హాస్య సంఘటనలన్నీ ఇంతకు ముందు ఏదో వారపత్రికలో ఎవరో రచయిత రాశాడు గదా!" అడిగాడు రంగారెడ్డి.

చంద్రకాంత్‌కి కోపం వచ్చింది.

"ఈ రోజుల్లో ఆ మాత్రం కాపీ కొట్టకుండా ఎలా రాయటం? అర్జంటుగా అన్నీ ఊహించి రాయాలంటే మనమేం వాల్మీకులమా, వ్యాస మహర్షులమా? ఇలా మాట్లాడితే ప్రతోడూ కాపీ అంటే నేనసలు రాయను! ఆ!" అన్నాడు లేచి నిలబడి.

అందరం కలసి బ్రతిమాలి మళ్ళీ కూర్చోబెట్టాము.

"అయినా అది పూర్తి కాపీ కాదులెండి. మధ్యలో డిటెక్టివ్ కథయిపోతుంది. ఒరిజినల్ రచయిత ఛస్తే కనుక్కోలేడు" అంది రాజేశ్వరి.

కథ విని మాకు తోచిన మార్పులు చేసుకుని దానిని టీవీ అధికారుల దగ్గరకు తీసుకెళ్ళాం.

"మా కమిటి వాళ్ళందరం పరిశీలించి మీకు తెలియజేస్తాం లెండి! అన్నాడా అధికారి. అందరం ఆనందంగా ఇంటికొచ్చాం!

"మరి ఈ సీరియల్‌కి టెక్నికల్ టీమ్ ఎవరు?" అడిగాడు శాయిరామ్.

"కెమెరా మాత్రం నేనే" అంటూ ముందుకొచ్చాడు– పెళ్ళిళ్ళు షూటింగ్ చేసే కెమెరామెన్ కుమార్.

"ఓ.కే– నీ ఛార్జీ ఎంత?"

"పదివేల రూపాయలు ఇవ్వాలండీ!" అన్నాడు కుమార్ కాసేపు లెఖ్ఖలు వేసి.

"నూట అరవై రూపాయలిస్తాం!" అన్నాడు రంగారెడ్డి. "వేరే ఒకతను నూట ఎనభైకి వస్తానన్నాడు. నువ్వేదో మనవాడివని నీ దగ్గరకొచ్చాం!" అంటూ గాస్ కొట్టాడు.

కుమార్ అరగంటసేపు బ్రతిమాలాడు. ఇంకో పాతిక రూపాయలు పెంచమని! మేము ససేమిరా వప్పుకోలేదు. మాది అసలే లోబడ్జెట్ సీరియల్ అని చెప్పాము.

చివరకు ఒప్పందం కుదిరింది. టీవీ ఫిలిమ్‌లో తనక్కూడ ఓ వేషం ఇవ్వడానికి ఒప్పుకున్నాం! పాతికరూపాయలు అడ్వాన్స్ ఇచ్చి ఇంటికి తిరిగివచ్చాము. అప్పటికే మా వీడియో ఫిలిమ్ డైరెక్షన్ చేయటానికని బోస్‌బాబు మద్రాస్ నుంచి వచ్చేశాడు.

"నీకెవరు చెప్పారు– మేము టీవీ సీరియల్ తీస్తున్నట్లు?" ఆశ్చర్యంగా అడిగాన్నేను.

"పేపరులో గోపాల్రావ్ రాసిన న్యూస్ చూసి వచ్చేశాను. నిజానికి నేను మద్రాస్‌లో చాలా బిజీగా ఉన్నారు. ఆరు పిక్చర్స్‌కి డైరెక్షన్ చేయమని ప్రాణం తీస్తున్నారు. కానీ వప్పుకోలేదు. మనాళ్ళ సీరియల్ చేయటంలో ఉన్న ఆనందం అందులో లేదు కదా! ఇంతకూ కెమెరా యూనిట్ ఎవరిది?" అడిగాడతను.

"కుమార్ ఫొటోగ్రాఫర్స్ లేడూ? వాడే కెమెరామన్! పాపం– మొత్తం సీరియల్ నూట అరవై రూపాయలకు చేయటానికి వప్పుకున్నాడు.

"కుమార్ కెమెరామెన్నా? మీకేం మతిపోలేదు కదా!"

"ఎందుకని? మొన్న పెళ్ళిలో బాగానే చేశాడుగా–"

బోస్ రెండు చేతులతో తలపట్టు క్కూర్చున్నాడు.

ఆ కెమెరా పనికిరాదయ్యా బాబు. టీవీ సీరియల్ కెమెరా వేరు. ఆ కెమెరామెన్‌లు వేరు! "యుమాటిక్ కెమెరా" అంటారు దాన్ని- అలాగే దాని కాసెట్స్ కూడా వేరు!"

అందరం తెల్లమొఖం వేశాం.

యాదగిరి రివ్వున బయటకు పరుగెత్తి రెండు నిమిషాల్లో రొప్పుకుంటూ తిరిగి వచ్చేశాడు.

"అయిదు రూపాయలు ఖర్చయి పోయిందంటుండు! మిగతా ఇరవై రూపాయలు లాక్కొచ్చేసినా- ఆ కుమార్ దగ్గర్నుంచీ!" అన్నాడు ఆనందంగా.

అందరం కలిసి "యుమాటిక్" కెమెరాల కోసం అర్జంటుగా వేట మొదలుపెట్టాం! హైద్రాబాద్‌లో రెండే రెండు యూనిట్లున్నాయని తెలిసేసరికి సగం ఉత్సాహం తగ్గిపోయింది. మిగతా సగం ఆ యూనిట్‌కి గాను మేమివ్వాల్సిన మొత్తం సంగతి వినేసరికి పోయింది. ఎలాగయితేనేం అంతా సెటిల్ చేసేసుకున్నాం! ఇంక షూటింగ్ స్టార్టవటమే తరువాయ్. అప్పుడు వచ్చింది టీవీ స్టేషన్ నుంచి ఉత్తరం.

మా స్క్రిప్ట్‌ని వాళ్ళు ఉపయోగించుకోవటం సాధ్యం కాదట! అంత మాత్రాన మా స్క్రిప్టు ఏ రకంగానూ బాగోలేదని అనుకోనవసరం లేదని మరో వాక్యం.

మా కాలనీలో దాని అర్థం సరిగ్గా తెలీటం లేదు. అందరం టీవీ స్టేషన్‌కెళ్ళాం!

స్క్రిప్ట్ బాగానే ఉందిగాని మేము ఉపయోగించుకోలేకపోతున్నాం" అంటే ఏమిటి? అనడిగాడు రంగారెడ్డి. ఆ అధికారి చిరాగ్గా చూశాడు మా వేపు.

"అందులో మా పాలసీకి సరిపడని కొన్ని అంశాలున్నాయ్ అన్నమాట."

"మీ పాలసీ ఏమిటసలు?"

ఆ అధికారి కొద్దిక్షణాలు ఆలోచించాడు. తరువాత ఫోనులో ఎవరినో పిలిచి పాలసీ గురించి అడిగాడు. ఆ తరువాత మరికొన్ని ఫోన్లు మోగాయ్.

"ఇప్పుడే చెప్తాను! ఒక్క నిమిషం!" అంటూ బయటికెళ్ళి అరగంట తర్వాత తిరిగి వచ్చాడు.

"పాలసీ ఏమిటో ఎవరికీ కరెక్టుగా తెలీదండీ! మాకేది నచ్చితే అదే పాలసీ అని మా కాషియర్ అంటున్నాడు. అయినా అది మీకు చెప్పనవసరం లేదని మా ఢిల్లీ అధికారులు అన్నారు."

అందరం మొఖాలు చూచుకున్నాం.

"పోనీ మా స్క్రిపులో మీ పాలసీకి అడ్డు తగిలిన అంశం ఏమిటో చెప్తారా? ఎందుకంటే భవిష్యత్తులో మీ పాలసీ, మా రచయిత పాలసీ 'క్లాష్' అవకుండా జాగ్రత్త పడతాం!" అన్నాడు రంగారెడ్డి.

"కథలో ఒక మినిష్టర్ పాత్ర ఉందయ్యా! మినిస్టర్లు, ఎమ్మెల్యేలు, ఎంపీలకు సంబంధించిన అవినీతి భాగోతాలే కాకుండా వాళ్ళ ప్రస్తావన కూడా రాకూడదు మా సీరియల్స్‌లో!

చంద్రకాంత్ కోపంగా నిలబడ్డాడు.

"డెమొక్రసీలో ఇలాంటివన్నీ ఎలా కుదురుతాయ్?" కోపంగా అన్నాడతను.

"అంటే వ్యాపారస్తులు, ఉద్యోగస్తులు అందరి గురించీ ఇష్టమొచ్చినట్లు రాసుకోవచ్చు! అంతేనాండీ?"

"ఎగ్జాట్‌లీ- మనది డెమొక్రసీ నాయినా! వ్యక్తి స్వాతంత్ర్యం సంపూర్ణంగా వుంది మనకు! రాజకీయ నాయకుల జోలికి పోనంతవరకూ-"

"అంటే ఆ మినిష్టర్లు, ఎమ్మెల్యేలు, ఎంపీలు. కౌన్సిలర్లూ- వీళ్ళందరూ మనుషులు కారా సార్? వాళ్ళకు నీతి, అవినీతి, లంచాలూ, మోసాలూ, మంచీ, చెడూ ఇవేమీ ఉండవా? వాళ్ళకూ పెళ్ళిళ్ళూ, ప్రియురాళ్ళూ, సెకండ్ సెటప్‌లూ, భార్యా బిడ్డలూ, బంధువులూ ఉండరా సార్?" కోపంగా అడిగాడు చంద్రకాంత్.

అందరం అతని నోరు మూసేసి బయటకు లాక్కెళ్ళాం!

"నీకేం పోయేకాలమొచ్చిందిరా అలా ఇష్టమొచ్చినట్లు మాట్లాడతావ్? మనదేశంలో ఉన్నది ఇండియా మార్క్ ప్రజాస్వామ్యమని మర్చిపోతే ఎలా? అన్నీ ఇష్టం వచ్చినట్లు చేస్తే లోపలకు తోసేస్తారు. పోలీస్ స్టేషన్ మన కాలనీలో పెట్టిన కొత్తలో అనుభవించిన అనుభవాలు మర్చిపోయావా?" అంటూ కేకలేసేసరికి వాడు స్పృహలో కొచ్చాడు.

అందరం లోపలకెళ్ళి ఆ అధికారిని క్షమార్పణ కోరాం.

"వాడిని క్షమించండి సార్! మనదేశం మార్కు డెమొక్రసీ అంటే బొత్తిగా తెలిచ్చావదు వాడికి! ఇప్పుడేం చేయమంటారు మరి?"

ఆ అధికారి మళ్ళీ ఓ క్షణం ఆలోచించాడు.

"మార్చేయండి! స్క్రిప్ట్‌లో ఎక్కడా మంత్రి అనిగానీ, ఎంపీ అనిగానీ, ఎమ్మెల్యే అనిగానీ అసెంబ్లీ గురించి గానీ, కౌన్సిల్ గురించి గానీ, ఒక్క ముక్క కూడా రాయకూడదు, కనబడగూడదు! ఒకవేళ రాసినా గానీ వాళ్ళంతా దేవతలు, త్యాగమూర్తులు, నీతిపరులు అని మాత్రమే రాయాలి.

"మరి జాతీయ కార్యక్రమాల్లో "నుక్కడ్" సీరియల్లో ఎలక్షన్ల గురించి "ఎపిసోడ్" మొత్తం ఉందికద్సార్?"

ఆ అధికారికి వళ్ళు మండిపోయింది.

"ఏం ప్రశ్నయ్యా ఇది? చూస్తే ఎద్యుకేటెడ్ లాగున్నారందరూ మళ్ళీ! ఆ? డెమొక్రసీ అన్నాక రకరకాలుంటుందయ్యా! అమెరికా డెమొక్రసీ వేరు, మనదేశంలో డెమొక్రసీ

వేరు! అవునా! అలాగే మన కేంద్రంలో ఉండే డెమొక్రసీ వేరు మన రాష్ట్రాల్లో వుండే డెమొక్రసీ వేరు! ఇదే మనదేశంలో వచ్చిన చావు! ప్రతోడూ పెద్ద తెలిసినట్లు డెమొక్రసీ గురించి మాట్లాడతాడు! అయినా టీవీ ఎవడిదయ్యా? మీ బాబుగాడి సొత్తా? ప్రభుత్వం చెమటోడ్చి కేవలం తమ పబ్లిసిటీ కోసం చేసి ఏర్పాటు చేసుకున్న ఆస్తయ్యా! అంచేత ప్రభుత్వం గురించి చెడు కనబడగూడదు, వినబడగూడదు! అర్థమయిందా?"

"అయిదండీ!"

"అయితే వెళ్ళి కథ మార్చుకురండి! ఫరెగ్జాంపుల్ ఒక మినిష్టరు గారు. పాపం ఆయన జీవితమంతా బలహీన వర్గాల ప్రజల కోసం త్యాగాలు చేసి చేసి చివరకు తనే బలహీనపడి- బలం లేక చనిపోయాడు! అలా రాయ్! అప్పుడు చూద్దాం!"

అందరం బయటకొచ్చి చంద్రకాంత్‌ని చీవాట్లు వేశాం!

ఇంకెప్పుడూ అలాంటి చెత్త స్క్రిప్ట్ రాయవద్దని!

వారం రోజుల్లో మనదేశంలో అందులోనూ మన రాష్ట్రంలో ఉన్న డెమొక్రసీని దృష్టిలో ఉంచుకుని ఇంకో సీరియల్ తయారుచేశాడు చంద్రకాంత్.

అది ఇచ్చిన పదిహేను రోజుల్లో ఉత్తరం వచ్చేసింది మళ్ళీ! దానర్థం ఏమిటంటే- అయ్యా! మీ స్క్రిప్ట్‌ని మేము ఉపయోగిచుకోలేక పోతున్నందుకు చింతిస్తున్నాం! అంతమాత్రాన అందులో మెరిట్ లేదని అనవసరంగా గాభరా పడకండి!"

మాకు కోపం ఆగలేదు.

ఈ స్క్రిప్ట్‌లో ఎక్కడ 'రాజకీయం' అనే పదం కూడా రాకుండా జాగ్రత్తలు తీసుకున్నాం! ఒకే ఒక్క చోట మాత్రం 'ఎన్నికలు' అని రాయాల్సి వచ్చింది. అందుకని దానిని కొంచెంగా మార్చి 'విదేశాలలో ఎన్నికలు' అని మార్చాము.

అందరం మళ్ళీ స్టూడియో మీదకు దాడిచేశాం.

"ఈ సారి ఏమిటండీ కారణం?" అనడిగాం.

"మా పాలసీకి కొంచెం అడ్డు వస్తోంది మళ్ళీ-" అన్నాడతను.

"ఏమిటి మీ పాలసీ?" అతను కోపంగా చూశాడు.

"ఎన్నిసార్లడుగుతారయ్యా ఈ ప్రశ్న? మాకు తెలీదని చెప్తూంటే జ్ఞానం లేదూ? మా పాలసీ ఏమిటో మాకు తెలిసేడుస్తే గైడ్‌లైన్స్‌లో స్క్రిప్ట్‌లో ఏమేం ఉండాలో, ఏమేం ఉండకూడదో ముందే అఘోరించే వాళ్ళంగా!"

"అయితేమరి-" తగ్గిపోయి బ్రతిమాలే ధోరణికొచ్చేశాము.

అతను మా స్క్రిప్ట్ తెప్పించి చూశాడు.

"ఇదేమిటయ్యా! ఈ పాత్ర మొదటినుంచీ చివరివరకూ 'మతం' గురించి మాట్లాడుతోంది. డెమొక్రసీలో 'మతం' గురించి ఎవరయినా మాట్లాడతారటయ్యా! ఆ

మాత్రం జ్ఞానం లేదూ మీకు? చూస్తే అంతా ఎడ్యుకేటెడ్ లాగున్నారు మళ్ళీ!"

"అదేమిటిసార్! మనది ఎక్యులర్ స్టేట్ కదా! ఎవరి మతం గురించి వాళ్ళు మాట్లాడుకోవచ్చు, ప్రచారం చేసుకోవచ్చు కదా!"

"అబ్బా! డెమొక్రసీ వేరు– సెక్యులరిజం వేరయ్యా!" అంటూ రెండు చేతుల్తో తల పట్టుకుని కళ్ళు మూసుకున్నాడు కాసేపు కోపంగా.

"కాని మరి మీరే టీవీలో ఎక్కడే మతం వాళ్ళ పండగ జరిగినా ఆ పండగ గురించీ, మతం గురించీ తెగ చూపిస్తున్నారు కదండీ' మన ప్రధానమంత్రి గారూ, ప్రెసిడెంట్ గారూ కూడా మతం వేడుకల్లో పాల్గొంటూ ఉంటారు!

ఆ అధికారికి ఇంక కోపం ఆగలేదు.

"మతం అనేది గవర్నమెంట్‌కి సంబంధించిందయ్యా! మీ కనవసరం తెల్సిదా? ఛఛఛ! ఇంతమాత్రం కూడా తెలీనివాళ్ళున్నారంటే ఆశ్చర్యంగా ఉంది మన దేశంలో"

"మరిప్పుడేం చేయమంటారండీ మమ్మల్ని?"

"ఈ స్క్రిప్ట్ అవతల పారెయ్యండి! వీలయితే కాల్చేసేయండి. లేకపోతే మత కలహాలు జరిగిపోతాయ్! కొత్త స్క్రిప్ట్ రాయండి! మతం, రాజకీయం అనేవి కనబడకూడదందులో! అర్థమయిందా?"

అందరం కాలనీకి తిరిగి వచ్చాం!

రాగానే మళ్ళీ చంద్రకాంత్ మీద విరుచుకుపడ్డాం.

"ఇదిగో చంద్రకాంత్! ఇది నీకు లాస్ట్ వార్నింగ్! ఈసారి స్క్రిప్ట్ రిజెక్ట్ అయ్యిందంటే చూస్కో మళ్ళీ–" అన్నాడు రంగారెడ్డి మండిపడుతూ.

"లేపోతే ఏమిటోయ్? మనది డెమొక్రసీ అన్న విషయం తెలిసి కూడా ఏమిటా తలపొగరు నీకు? నీ భావస్వాతంత్ర్యం వెళ్ళగక్కాలంటే అమెరికా వెళ్ళు! అంతేగానీ ఇలా టీవీ స్క్రిప్ట్ మీద అఘోరించకు!" అన్నాడు గోపాల్రావ్.

వారం రోజుల్లో ఇంకో స్క్రిప్ట్ తయారయింది. అది సబ్మిట్ చేసి ఫలితాల కోసం ఎదురుచూస్తూ కూర్చున్నాం–

సరిగ్గా నెలరోజుల తర్వాత వచ్చింది ఉత్తరం–

ప్రియమయిన అయ్యా!

నెలరోజుల క్రితం మీరిచ్చిన "సమాజానికి మరోముడి" అనే స్క్రిప్ట్‌ని పరిశీలించాము.

కానీ అది వాణిజ్య సీరియల్‌గా మా అవసరాలకు అనుగుణంగా లేదు. ఏదేమయినా ఇది మీ స్క్రిప్ట్ యొక్క గొప్పతనాన్ని ఏ విధంగానూ కించపరచటం కాదు.

మా సేవలో మీరు ఇంత ఆసక్తి కనబరుస్తున్నదుకు మీకు మా అభినందనలు.

మీ విశ్వాసనీయమయిన

స్టేషన్ డైరెక్టర్

అందరికీ వళ్ళు మండిపోయింది.

"మళ్ళీ ఏ మొచ్చింది వీళ్ళకు? మతం, రాజకీయం, ఎన్నికలు అనేవి ఎక్కడా ఒక్కచోట కూడా రాకుండా స్క్రిప్ట్ తయారుచేశాను కదా?" కోపంగా అన్నాడు చంద్రకాంత్.

అందరం మళ్ళీ టీవీ స్టేషన్ కెళ్ళాం.

"ఈ సారి మీ పాలసీకి ఎక్కడ అడ్డుపడింది సార్ మా స్క్రిప్ట్?" అడిగాడు చంద్రకాంత్.

ఆయన స్క్రిప్ట్ తెప్పించి ఓసారి చూశాడు.

"మీకేమయినా తెలివుందటయ్యా? కనీసం ఒక్కరికయినా తెలివి లేదా? కాలనీలో ఇంతమందున్నారు మళ్ళీ- మొత్తం సీరియల్ అంతా బార్స్‌లోనూ, రెస్టారెంట్స్‌లోనూ జరిగినట్లు చూపిస్తారా?"

"బార్‌లో జరిగినట్లు చూపిస్తే తప్పేమిటండీ? హీరో తాగుబోతు కాబట్టి కథ ఎక్కువగా బార్‌లోనే జరుగుతుంది-"

"అందుకే తెలివి లేనివాళ్ళన్నాను మిమ్మల్ని! టీవీలో బార్‌లు, కాబరేలు లాంటివి చూపించగూడదన్న ఇంగితం లేపోతే ఎలా? బార్‌లనేవి కనిపించకూడదు, వినిపించకూడదు-"

"అదేమిటిసార్? బార్‌లనేవి చూపించకుండా తాగుబోతు కథెలా చెప్తాం? అయినా బార్‌లు నిజ జీవితంలో ప్రతిరోడ్డుకీ అరడజనుంటున్నాయ్ కదా! అవి చాలక ప్రతి పేటకూ ఓ ప్రభుత్వ కల్లు కాంపౌండ్, సారా దుకాణాల్లాంటివి ప్రభుత్వమే ప్రారంభిస్తోంది కదా! ఈ మధ్య ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పాల పాకెట్లలాగా కల్లు, సారా లాంటివి పాలిథిన్ బాగ్స్‌లో "వారుణ వాహిని" అనే స్కీమ్‌లో సప్లయ్ చేస్తోంటే 'బార్' అనేది టీవీలో కనపించకూడదా? అంటే దేశంలో జరిగే నిజాలన్నీ దాచేసి పతివ్రతల్లో కల్సిపోయిన వ్యభిచారిణి లాంటి సీక్రెట్ ప్రోగ్రాంలు మాత్రమే అంగీ కరిస్తారా?" ఆవేశంగా అరిచాడు చంద్రకాంత్.

రంగారెడ్డి, యాదగిరీ, చంద్రకాంత్‌ని బలవంతంగా బయటకు లాక్కుపోయారు.

"నన్నొదలండి- నీ యవ్వ- ఈ టీవీ స్టేషన్ పని చెప్తాను- వదలండి-" అంటూ గింజుకుంటున్నాడు చంద్రకాంత్.

గోపాల్రావ్ కుర్చీ లాక్కుని కూర్చున్నాడు.

"అతని సంగతి పట్టించుకోకండి సార్! పైకలా అరుస్తాడు గానీ నిజానికి టీవీ ప్రోగ్రామ్‌లంటే చచ్చేంత భయం! ఛస్తే మీమీద ఎటాక్ చేయలేడు. రాసిస్తానలా అని-" అన్నాడు ఆ అధికారికి నచ్చచెప్తూ.

"ఆ సంగతి మాకూ తెలుసులేవయ్యా! అందుకే ఎవరైనా గానీ మా హైద్రాబాద్ టీవీ స్టేషన్‌లోనే పని చేయాలని మా డిపార్ట్మెంటు వాళ్ళు మొత్తం

ఉవ్విళ్ళూరు తుంటారు– ఇది సేఫెస్ట్ ప్లేస్ అని!"

"అవున్సార్ నాకు తెలీకడుగుతాను– ఆ మధ్య మీ టీవీ వాళ్ళే "చల్‌చల్ గుర్రం" అనే నాటకం ఒకటి తెలుగువాళ్ళ గొప్ప పండుగ నాడు టెలికాస్ట్ చేశారు కదా! మరందులో తాగే సీన్ ఉంది కాదా!" అన్నాడు శాయిరామ్.

"అంతేకాద్సార్– మరో నాటకంలో కూడా 'బార్' సీన్ చూపించారు. మన హైద్రాబాద్ టీవీ వాళ్ళు–" అంది రాజేశ్వరి.

"హైదరాబాదేం ఖర్మ? హిందీ సీరియల్స్‌లో రెండు మూడుసార్లు క్లబ్‌లో తాగే సీన్లు చూపించారు–" అంది పార్వతీదేవి.

''నుక్కడ్‌లో కూడా తాగుడు సీన్లు చూపించారు'' అరచాడు చంద్రకాంత్ బయటనుంచే– అధికారికి కోపం ముంచుకొచ్చింది.

"నేషనల్ లెవల్లో తాగొచ్చయ్యా! రీజినల్ లెవల్లో తాగకూడదని మా గైడ్‌లైన్స్‌లో ఉంది– అయినా అవన్నీ ఎవరు చూడొచ్చారు– ఇదిగో! మమ్మల్ని ప్రశ్నలేసే అధికారం – పత్రికల వాళ్ళకే లేదయ్యా మీరెవరు మమ్మల్ని అడగటానికి? ఇంకోసారిలా మెలిక ప్రశ్న లేశారంటే సెక్యూరిటీ వాళ్ళను పిలిపించి బయటకు గెంటిస్తాం–" తాగుడు అనేది ఎక్కడా లేదు. అంతే! కావాలంటే తాగిన తరువాత ఎఫెక్ట్స్ చూపించుకోవచ్చు– ఇంతేనా, ఇంకేమయినా అడగాల్సినవి ఉన్నాయా?"

"ఇంకేం లేవుసార్–"

"అయితే మీరిక వెళ్ళండి! ఆ! అన్నట్లు ఇంకో విషయం మీ స్క్రిప్ట్‌లో ఇంకోచోట ''నాకిద్దరూ ఆడిపిల్లలే'' అన్న డైలాగుంది. అలాంటివి కూడా రాయకూడదు. గుర్తుంచుకోండి!"

అందరం నిర్ఘాంతపోయాం.

"ఏమిటి ఏమన్నారు? ఇద్దరూ ఆడపిల్లలే అని తండ్రి పాత్ర అనకూడదా?" కోపంగా దూరం నుంచి అరచాడు చంద్రకాంత్.

"అనకూడదు–"

"ఎందుకని సార్? ఎవరయినా మీకెంతమంది పిల్లలు అని ఎవర్నయినా అడినప్పుడు "ఇద్దరూ ఆడపిల్లలే" అని ఆ తండ్రి జవాబు చెప్పకూడదా?"

"చెప్పకూడదు అనేగా నేను మొత్తుకునేది. అలా చెప్పటం వల్ల మన స్త్రీ జాతిని కించపరిచి నట్లవుతుంది!"

"మరే మనాలి సార్– మీ టివి భాష ప్రకారమయితే?"

"ఇద్దరు అమ్మాయిలు" అనాలి!

"అమ్మాయిలకూ, ఆడపిల్లలకూ తేడా?"

అధికారి కోపంగా లేచి నిలబడ్డాడు.

"అలాంటి మెలిక ప్రశ్నలేయకూడదని ఇందాకే ఓసారి చెప్పాను. మేమేది చెప్తే అది మీరు నోర్మూసుకుని చేసేయడానికే మీరిక్కడికొచ్చారు. వాదనలూ, ప్రతి వాదనలూ కోసమయితే కోర్టుకెళ్ళండి! డోన్ట్‌వేస్ట్ అవర్ టైమ్–"

"ఏమిటి? డోన్ట్‌వేస్ట్ అవర్ టైమా? మొత్తం తెలుగు రాష్ట్రంలోని ప్రజల టైమంతా దిక్కుమాలిన ప్రోగ్రామ్స్‌తో వేస్ట్ చేస్తోంది మీరు" మళ్ళీ దూరం నుంచి అరచాడు చంద్రకాంత్. యాదగిరి రంగారెడ్డి అతనింకేదో కూడా మాట్లాడబోతూంటే నోరు మూసేశారు. కొద్దిసేపు అందరం ప్రశ్న లేయకుండా నిశ్శబ్దంగా ఉన్నాక టీవీ అధికారిని నెమ్మదిగా అడిగాం.

"సార్– పోనీమీరే కథ చెపితే రాసుకుని మీకు సబ్మిట్ చేస్తాం– కావాలంటే ఆ కథ చెప్పినందుగ్గాను మీకూ కొంత ఇచ్చుకుంటాం–"

ఆ అధికారి అంత ఎత్తున ఎగిరిపడ్డాడు.

"ఏమిటి? లంచాలా? టీవీలో లంచాల గురించి మాట్లాడుతారా? ఎంత ధైర్యం మీకు? మిమ్మల్ని అరెస్ట్ చేయిస్తాను– జైల్లోకి తోయిస్తాను–" అన్నాడు ఫోన్ తీసుకుని.

అందరం భయపడిపోయాం–

"అది కాద్సార్! ఆ మధ్య ఏదో ఇంగ్లీష్ పత్రికలో చదివాం ఢిల్లీ దూరదర్శన్‌లో ఇలాంటి సీరియల్ స్క్రిప్ట్‌లు మంజూరు చేసినందుగ్గాను రెండులక్షలు లంచం తీసుకుటున్నారట! ఆ నమ్మకంతోనే మిమ్మల్నిలా అడిగాము!"

"అలాంటి పిచ్చి రాతలన్నీ నమ్మకండి! అంచాలు, అవినీతి అనేవి ప్రస్తుతం మనదేశంలో ఎక్కడాలేవు, రాజీవ్‌గాంధీ వచ్చాక అది మొత్తం నిర్మూలించేశారు. మా రేడియో, టీవీ వార్తల్లో రోజూ ఈ విషయం చెపుతూనే ఉన్నాం కదా వినటం లేదా?"

అందరం మొఖాలు చూసుకున్నాం.

"ఆ వార్తలు మేమెవ్వరం వినమండీ!" అన్నాను నసుగుతూ.

అతను షాక్ తిన్నట్లు చూశాడు మావేపు.

"ఏమిటి? మీరు మా వార్తలు వినరా? ఎందుకని?"

"అవి వింటూంటే– ఎంచేతో ఏమో నమ్మబుద్ధి కాదండీ!" భయంగా అన్నాడు శాయిరామ్.

"మరి మీకు మనదేశంలో ఏం జరుగుతోందీ ఎలా తెలుస్తుంది?"

"న్యూస్‌పేపర్స్ చదువుతాం కదండీ! వాటి ద్వారా తెలుస్తాయ్–"

అధికారి నుదుటిమీద కొట్టుకున్నాడు.

"మీరే కాలనీలో ఉన్నారో, ఆ కాలనీ ఎక్కడుందో గానీ అందరూ సర్వనాశనమయి

పోతున్నారు. బొత్తిగా మా టీవీ వార్తలు నమ్మటం లేదంటే మీకేమాత్రం దేశభక్తి లేదని అర్థమయిపోతోంది. నాకేగిన్నా పవర్స్ ఉంటే మీ కాలనీ వాళ్ళందరినీ నాసా కింద బుక్ చేయించి జైల్లోకి తోయించేవాడిని-"

"అవున్సార్!" వప్పుకున్నాం అందరం.

"వెళ్ళండి! వెరయిటీ స్క్రిప్టులు రాయించుకు రండి! ప్రభుత్వం టీవీని ట్వంటీఫస్ట్ సెంచరీలోకి తీసుకెళ్తోంటే మీ స్క్రిప్ట్ పంథొమ్మిదో శతాబ్దంలో ఉంటే ఎట్లా! మనది డెమొక్రసీ అనేది గుర్తుంచుకోమని ఆ రచయితలకుచెప్పండి! ఎలాంటి అక్రమాల నయినా, ఎవరే అన్యాయాలు చేసినా మీ స్క్రిప్టుల ద్వారా యధేచ్చగా విమర్శించవచ్చు! మనదేశంలో ఉన్నంత స్వేచ్ఛ ప్రపంచంలో ఇంకెక్కడా లేదని నిన్నేగా టీవీలో చెప్పాం? అదికూడా వినలేదా మీరు?"

"లేదండీ-"

"యూస్‌లెస్ ఫెలోస్! మా స్క్రిప్టులో ఒకే ఒక్క విషయం కనిపించకుండా చూసుకోండయ్యా చాలు!"

"ఏమిటిసార్ అది?" రహస్యంగా అడిగాడు రంగారెడ్డి.

"అదేనయ్యా! నిజాలు, సహజత్వం ఈ రెండూ టీవీ ఛాయలక్కూడా రాకూడదు-"

"అంతేకదా- అయితే సరే" అందరం ఉత్సాహంగా కాలనీకి తిరిగి వచ్చాము.

ఆ రాత్రంతా చంద్రకాంత్‌ని ఊదరగొట్టి, రకరకాల అయిడియాలు మేమే ఇచ్చి తెల్లారే సరికల్లా ఇంకో స్క్రిప్ట్ తయారుచేయించాము.

సబ్మిట్ చేసిన పదిహేను రోజులకే మధాప్రకారం ఉత్తరం వచ్చింది. అయితే ఈసారి మా స్క్రిప్టు ఓ.కే. అయిపోయింది గానీ దానిలో కొన్ని మార్పులు చేయాల్సి ఉందని సూచించారు. దాంతో మాకు ఎక్కడలేని ఆనందం కలిగింది. అందరం కలసి శెలవుపెట్టి టీవీ స్టేషన్ చేరుకున్నాం.

మమ్మల్ని చూడగానే (ఆ అధికారి) మొఖంలో కోపం ముంచుకొచ్చేసింది.

"ఇదిగో! మీకేమయినా తెలివుందటయ్యా?"

"శుభ్రంగా ఉందండీ! ఎందుకంటే మేము మీ ప్రోగ్రాంలు చూడం కదండీ!" తడబడతూ అన్నాడు రెడ్డి.

"ఆహా- అబ్బ-అబ్బ- ఏం దెబ్బ కొట్టావ్ గురూ-" పగలబడి నవ్వుతూ అన్నాడు యాదగిరి.

నేనూ శాయిరామ్ కలసి వాళ్ళిద్దరినీ కోప్పడి మళ్ళా ఆ అధికరి దగ్గరకొచ్చాము. స్క్రిప్టులో ఓ పేజి తీసి మా వేపు గిర్రున తిరిగాడతను.

"ఇదిగో! ఏమిటయ్యా ఇది? ఎవడింట్లోనో దొంగలు పడి సామాన్లెత్తుకుపోతే దానికి

బాధ్యత పోలీసులదా? చేతకాని డిపార్టుమెంట్, లంచగొండి డిపార్టుమెంట్ అని రాస్తారా? మీకేమయినా బుద్ధుందా? దొంగతనాలకూ పోలీస్ డిపార్టుమెంట్‌కీ ఏమిటయ్యా సంబంధం? అయినా గవర్నమెంట్ డిపార్టుమెంట్స్‌ని ఏమాత్రం విమర్శించకూడదని మీకు ఇన్ని సంవత్సరాలయినా ఇంకా తెలీదా?" అంటూ మరో రెండు పేజీలు తిరగేశాడు. ఓ పేజీ చూస్తూనే స్క్రిప్ట్ మా మీదకు విసిరికొట్టాడు.

"అదేమిటయా! రైల్వేలో బెర్తులు కావాలంటే లంచాలు ఇవ్వాలా? రైల్వే నిండా అవినీతి ఉందా?" అడిగాడు కోపంగా.

"అవునండీ! నిజంగానే ఉంది! మొన్నే బాంబేనుండి వచ్చేప్పుడు బెర్తు కోసం పాతిక రూపాయలు లంచమిచ్చాను–" అన్నాడు గోపాల్రావ్.

ఆ అధికారి అసహనంగా లేచి నిలబడ్డాడు. పక్కనే ఉన్న ఫోన్ అందుకుని రింగ్ చేశాడు.

"హలో నేను హైద్రాబాద్ టీవీ నుంచి మాట్లాడుతున్నా– మీ రైల్వేలో అవినీతి ఉ ందని ఇక్కడ ఎవరో అంటున్నారు– నిజమేనా? – ఏమిటి? అంతా అబద్దమా! నేనూ అదే అనుకున్నాలెండి!" ఫోన్ డిస్కనెక్ట్ చేసి మరికొన్ని ఆఫీసులకు కూడా రింగ్ చేశాడు. ఆ తర్వాత మావేపు తిరిగాడు.

"చూశారా– అదంతా మీ ఇల్యూజన్! అంతే! ఏ ప్రభుత్వ కార్యాలయంలోనూ అవినీతి అనేదే లేదంటున్నారు. అంతగా కావాలంటే వరకట్నాల గురించీ, పోలియో వ్యాధుల గరించీ, పరిసరాల పరిశుభ్రత గురించీ, మనుషులను కరిచే పిచ్చి కుక్కల గురించీ, పంటలను నాశనం చేసే కీటకాల గురించీ– యథేచ్ఛగా విమర్శించండి! ఏం ఫరవాలేదు"

"కాని మరి 'రజని' అనే హిందీ టీవీ సీరియల్లో హీరోయిన్ అన్ని ప్రభుత్వ డిపార్టుమెంట్స్‌నీ విమర్శించింది కదండీ– వాళ్ళెలా వప్పుకున్నారు. ఆ స్క్రిప్టని?" అడిగాడు జనార్థన్.

"ఇదిగో మళ్ళీ మెలిక ప్రశ్నలేస్తున్నారు కదూ?" కోపం తెచ్చుకుంటూ అడిగాడతను.

"అబ్బే– వాడి ప్రశ్నలు పట్టించుకోకండి సార్! వాడి మాటలే అంత– మెలికలు తిప్పి మాట్లాడుతూంటాడు అన్నీను" సర్ది చెప్పాడు రంగారెడ్డి.

"అసలీ గొడవంతా ఎందుకుసార్? కథ మీరే చెప్పడి– రాసుకుంటాం!" అన్నాడు జనార్ధన్ కాగితం కలం తీసుకుని.

ఆ అధికారి కొద్ది క్షణాలు ఆలోచించాడు.

"ఆల్ రైట్! రాసుకోండి! ఉట్టి అవుట్‌లైన్స్ ఇస్తాను. దానినిబట్టి డెవలప్ చేయించుకోండి! సరేనా?"

"అలాగే సార్!"

"అనగనగా ఓ హీరో! వాడు చాలా బీదాడు. అట్టడుగు వర్గానికి చెందినవాడు. చెప్పులు కుడుతూంటాడు. అంచేత చాలా దేశభక్తుడు, టీవీలో వార్తల్ని పూర్తిగా నమ్మినట్లు కనిపించటమే కాకుండ ఆనిజంగా నమ్ముతాడు కూడా!

ప్రతివారం అతని పాటతో సీరియల్ స్టార్టవుతుంది.

భారతదేశమేరా బంగారుదేశం–

భారతవాసులేరా బంగారు ప్రజలూ–

మనమంతా ఐక్యం రా–

మనదేశం సమైక్యం రా–

ఈ పాట నేనే రాసిస్తాన్లే! ఇలా మొదలయి పన్నెండు వారాలు పన్నెండు సంఘటనలతో కథ జరుగుతుంది. మొదటి వారం వాడి కూతురుకి పెళ్ళి చేయాలనుకుంటాడు. కట్నం సమస్యవల్ల పెళ్ళి ఆగిపోతుంది. అతను సమాజాన్ని తిడుతూండగా కథ ముగుస్తుంది. రెండోవారం అతని చిన్న కొడుక్కి జబ్బు చేస్తుంది. ప్రైవేట్ డాక్టర్లు అతనిని పదకొండు వందల రూపాయల ఫీజు అడుగుతారు. ఇవ్వలేక నానాకష్టాలూ పడి ఆఖర్లో కొడుకుని ప్రభుత్వ హాస్పిటల్‌కి తీసుకెళ్తాడు. అక్కడ హాస్పిటల్లోని మొత్తం డాక్టర్లందరూ పరుగుతో వచ్చి ఆ కుర్రాడికి ఆపరేషన్ చేసి, ఆ డాక్టర్లే బ్లడ్ ఇచ్చి వాడిని రక్షిస్తాడు. తరువాతి వారంలో అతను అడుక్కు తినే పరిస్థితి వస్తుంది. కొత్తరకాల బూట్లు వచ్చేసరికి పాత చెప్పుల రిపేర్లు తగ్గిపోతాయ్. అప్పుడు బాంకులన్నీ అతనింటికి వచ్చి అతనికి రకరకాల ఋణాలిస్తాయ్. దాంతో అతను పెద్ద చెప్పుల ఫాక్టరీ కట్టించి, దాని గడపలో ప్రభుత్వం తాలూకు ఫొటోలు పెట్టుకుని రోజూ భజనలు చేస్తుంటాడు. ఇలా మనమంతా 'రియాలిటీ' అంటే నగ్నసత్యాలు చూసిస్తామన్నమాట! ప్రతివారం ప్రభుత్వం బీదల కోసం, ప్రజల కోసం చేస్తున్న అద్భుత కార్యక్రమాల గురించి చెప్పి వాటి వల్ల మనదేశం, మన ప్రజలూ ఎంత ప్రగతి సాధించిందీ, ప్రజలంతా ఎంత సుఖంగా ఉ ందీ– వివిధ పాత్రల ద్వారా చెప్పిస్తాం! ఎంత వెరయిటీ టీవీ సీరియల్ చెప్పానో చూశారా? ఒకవేళ వారం వారం నాలుగయిదు నిమిషాలు ఫిలిమ్ నిడివి తగ్గిందనుకోండి! అప్పుడు సినిమా నటుడినెవర్నో తీసుకొచ్చి ఆ వారం జరిగిన కథ ఏమిటో అందరికీ చెప్పిస్తే టైమ్ సరిపోతుంది. మీకు షూటింగ్ ఖర్చు కూడ తగ్గిపోతుంది. ఆఖర్లో– అంటే పదమూడో వారంలో మొత్తం ఎపిసోడ్ అంతా సినిమా నటుడే కనబడి కథ ఎండింగ్ చెప్పేస్తాడు; విజువల్‌గా ఏమీ చూపించాం! అదొక వెరయిటీ అన్నమాట."

అందరం ఆయనకు ధన్యవాదాలు తెలిపి కాలనీకి చేరుకున్నాం. ఆయన సూచించిన విధంగానే కథ తయారుచేశాము.

స్క్రిప్ట్ సబ్మిట్ చేశాక వెంటనే ఏ పాత్ర ఎవరు చేయాలా అనేది నిర్ణయించడానికి ఆ ఆదివారం నాడు అందరం సమావేశమయాం మళ్లీ.

"నేనే హీరో" అన్నాడు జనార్దన్.

"అదేమిటి? హీరో ముసలాడు కదా? అదీగాక చెప్పులు కుట్టే పాత్ర కనుక దానికి గ్లామర్ మొఖం అఖ్ఖర్లేదు–" అన్నాడు బోసు బాబు.

""కథ కొంచెం మార్చేద్దాంలెండి! ముసలాడు కాదు. గ్రాడ్యుయేట్! చాలా అందంగా ఉంటాడు. మార్కెట్లో ఓ పెద్ద చెప్పులషాపు తెరుస్తాడు– కాంపిటీషన్‌లో గొడవలు, ఫైట్సు– అన్నా చక్కగా వర్కవుట్ చేసుకోవచ్చు. అదే షాపుకి లేటెస్ట్ మోడల్ చెప్పులు కొనడానికి కోటీశ్వరుడి కూతురు షీలా వస్తుంది. ఇద్దరూ మొదటి చెప్పుల జతలోనే ప్రేమలో పడతారు– కట్ చేస్తే– బృందావన్ గార్డెన్స్‌లో డ్యూయెట్–"

అందరం తల పట్టుకుని కూర్చోవటం చూసి ఆపేశాడు జనార్ధన్.

"హీరోకి ఎంత డబ్బిద్దాం?" అడిగాడు యాదగిరి.

"ఒకో ఎపిసోడ్‌కి అయిదొందలయినా యివ్వాలి–" అన్నాడు జనార్ధన్.

"ఇదే సినిమాల్లో అయితే నారేటు ఇప్పుడు ఎనభయ్ వేలుంది."

అందరం గట్టిగా నవ్వేశాం.

"మూడొందలు" కాగితం మీద రాస్తూ అన్నాడు యాదగిరి.

కాలనీలో అందరికీ– పాత్రలు– ఎవరికెంత డబ్బివ్వాల్సిందీ రాసేయటం జరిగిపోయింది. రిహార్సల్స్ కోసం స్క్రిప్ట్ కాపీలు కూడా పంచిపెట్టాం.

ఆ సాయంత్రం రిహార్సల్ కోసమని మేమంతా రంగారెడ్డి ఇంటికెళ్ళబోతూంటే శ్యామ్రావ్ ఇంటిముందు కొన్ని వందల మంది గుమికూడి ఉండటం కనిపించింది.

అందరి గుండెలూ ఝుల్లుమన్నయ్–

పోలీసులకూ, ప్రభుత్వానికీ లంచం పెట్టి హెల్మెట్స్ ధరింపజేసే రూల్ తెప్పించిన దగ్గర్నుంచీ మాకు శ్యామ్రావంటే భయంగానే ఉంది.

అందరం శ్యామ్రావ్ ఇంటికి చేరుకుని ఆ జనాన్ని తోసుకుంటూ ముందుకి వెళ్ళాం.

శ్యామ్రావ్ అతని పెద్దకొడుకూ కూర్చుని ఇంటర్వ్యూ లాంటిది కండక్ట్ చేస్తున్నారు.

"ఏమి ఇంటర్వ్యూ ఇది?" ఒకతనిని అడిగాము.

"శ్యామ్రావ్‌గారు ఎనిమిది టీవీ సీరియల్స్ తీస్తున్నారు కదా! అన్నిటికీ నటీనటులను సెలక్ట్ చేస్తున్నారు. ఇంటర్వ్యూలు జరుగుతున్నాయ్–" అన్నాడతను.

అందరం నిర్ఘాంతపోయాం.

"ఎనిమిది టీవీ సీరియల్సా?" నమ్మశక్యం కాక మళ్ళీ అడిగాడు శాయిరామ్.

"అవున్సార్! అన్నీ నిన్నే- ఎప్రూవ్ చేశారట టీవీవాళ్ళు-" మాకు కొద్ది క్షణాల వరకూ నోటమాట రాలేదు-

శ్యామ్రావ్ లైన్‌లో నిలబడ్డ ఓ వ్యక్తిని పిలిచాడు.

"నీ పేరేంట్రా?"

"కొండిగాడండీ-"

"ఎంతవరకు చదివావ్ నువ్వు?"

"సదువెక్కడిదండీ- అ ఆ ఇ ఈ అన్నీ వచ్చుండి- అంతొరకే-"

రెండుగంటల్లో ఆర్టిస్ట్‌ల సెలక్షన్ పూర్తయిపోయింది.

"ఎంతమందిని సెలక్ట్ చేశావ్?" రమణారావ్‌ని అడిగాడు శ్యామ్రావ్.

"నూట అరవైమంది అయారు!"

శ్యామ్రావ్ ఆశ్చర్యపోయాడు.

"అదేమిటి? మనక్కావలసింది వందమందేగా!"

"ఇంకో అరవై కొత్త పాత్రలు ఇవాళ రాత్రి కూర్చుని రాసేస్తాన్లెండి! వచ్చే డబ్బు ఎందుకు వదులుకోవటం- చాలామంది రెండు వందలకంటే ఎక్కువ ఇవ్వలేమంటున్నారు. అందుకని తప్పదు మరి-"

"అదేమిటి? స్క్రిప్ట్ మీరే రాశారా?" రమణారావ్ నడిగాడు రంగారెడ్డి.

"అవును! ఇంకెవరు రాస్తారు?"

"టీవీ స్క్రిప్ట్‌లు రాయటం తెలిసిన రచయితలుండాలి కదా-" అన్నాడు శాయిరాం.

శ్యామ్రావ్, రమణారావ్ ఇద్దరూ పగలబడి నవ్వారు.

"ఇదేం సినిమా అనుకున్నారా! చెత్త స్క్రిప్ట్ అయితే జనం చూడరని భయపడటానికి! ఇక్కడ ఏ చెత్త అయినా చచ్చినట్లు చూడాల్సిందే- మాకేం ఖర్మ- బోలెడు డబ్బుపోసి గొప్ప రచయితల దగ్గర కెళ్ళటానికి-"

ఇంక లాభం లేదని మేము వచ్చేశాం.

ఆ మధ్యాహ్నానికల్లా షూటింగ్ ఏర్పాట్లన్నీ పూర్తి అయిపోయాయ్. మర్నాడు షూటింగ్ చేయాల్సిన స్క్రిప్ట్ గురించి కెమెరామెన్, డైరెక్టర్ బోసుబాబు కాలనీ స్టేజ్ దగ్గర చర్చించుకుంటున్నారు. మిగతా అందరం వాళ్ళ చుట్టూ మూగి ఆసక్తిగా చూస్తున్నాం. తర్వాత బోస్ మా కాలనీ అర్టిస్టులందరికీ టీవీకి, స్టేజ్‌కి నటనలో చూపాల్సిన తేడా గురించి ఉపన్యాసం ఇవ్వసాగాడు.

"మీ అందరికీ డ్రామా ఎక్స్‌పీరియన్స్ ఉందని నాకు తెలుసు- ఇందులో కొంతమంది గవర్నమెంట్ టీవీ నటులున్నారని కూడా నాకు తెలుసు. మీరందరూ కూడా తెలుసుకోవలసిందేమిటంటే, మీరు నటన శరీరమంతటితో చేయటం తగ్గించి ఎక్కువగా మొఖంతో ప్రదర్శించటం నేర్చుకోవాలి-"

అప్పుడే ఓ వ్యక్తి ఆటోదిగి మా దగ్గరకు రావటం కనిపించింది. తాగినవాడిలా తూలుతూ మా దగ్గరకొచ్చాడు.

"మీతో ఒణ్ మినిట్ మాట్లాడాలి!" అన్నాడతను.

"మీరెవరు? ఏం మాట్లాడాలి!" అడిగాడు గోపాల్రావ్.

"షాలా అర్జెంట్ విషయం!"

"మాట్లాడండి మరి!" అన్నాడు రంగారెడ్డి వినడానికి రడీ అవుతూ.

అతను నిషాగా నవ్వాడు "ఆహాహాహా ఆ హా హా హా హా ఇక్కడ కాదు– మనం షీక్రెట్‌గా మాట్లాడాలి– ఇంతకూ షాయీరామ్ ఎవరు?" అడిగాడతను.

"నేనే– ఏమిటి సంగతి?" అడిగాడు శాయిరామ్ ముందుకొచ్చి.

"నన్ను ఇంకా గుర్తుపట్టలేదా మీరు హాహాహా– ఆ హా హా హా నేను షార్? మీరు అదివరకు టీవీ స్టేషన్లో డ్రామా వేశారు కదా! అప్పుడు నేను కాజువల్ వర్కర్‌గా ఉ ండేవాడిని. దేవుడి దయవల్ల రెండేళ్ళల్లో ప్రొడ్యూసరై పోయాను– ఆ హాహాహా ఆ హాహాహా– మా అంకుల్ ఢిల్లీ దూరదర్శన్‌లో ప్యూన్. అందుకని ఆహాహాహా– ఆ హాహాహా–"

"ఇంతకూ ఇప్పుడేమంటారు?" అడిగాడు రంగారెడ్డి.

"ఏమనేదేముంది షార్! మనకి డైరష్షన్ చేయటమంటే చాలా ఇష్టం! నాకు పదహారు అవార్డులు కూడా వష్చాయ్! మా బామ్మర్ధికి కూడా డైరష్షన్ అంటే తెగిష్టం! అందుకని వాడిని మీ టీవీ సీరియల్ డైరెష్షన్ ఛాన్స్ ఇమ్మని అడగటానికొచ్చాను– ఆహాహాహా ఆహాహాహా–.

అందరం మొఖాలు చూసుకున్నాం.

"డైరెక్షన్ చేయడానికి మీ బామ్మర్ధికి ఏం క్వాలిఫికేషన్స్ ఉన్నాయ్?" అడిగాడు జనార్థన్.

అతను నవ్వటం ఆపేశాడు.

"ఏమిషీ? క్వాలిఫికేషనా? టీవీ సీరియల్ డైరెష్షన్ చేయడానికి క్వాలిఫికేషనెందుకు?" ఆశ్చర్యంగా అడిగాడు.

"ఏమీ తెలీకుండా మరెలా తీస్తాడు?"

"భలేవాళ్ళే– నాలుగు షీరియల్స్ తీస్తే ఆడికే అన్నీ తెలుస్తయ్– మీరేం భయపడకండి! అయామ్ హియర్– ఆహాహాహా– ఆహాహాహా–"

"మీ షీరియల్స్ డైరెష్షన్ మాకొద్దుగానీ ఇక దయషేయండి– ఆహాహాహా ఆ హాహాహా–" అన్నాడు శాయిరామ్ హేళనగా.

అందరూ ఘొల్లున నవ్వారు.

అతనికి కోపం వచ్చేసింది.

"నన్ను ఇన్సల్ట్ షేష్తారా? ఆ! నన్ను ఇన్సల్ట్ షేష్తారా? టీవీ ప్రొడ్యూసర్ బామ్మరిదిని డైరెష్షన్ ఛాన్స్ ఇయ్యనంటారా? ఎంత ధైర్యం మీకు. మీరింక జన్మలో టీవీ మొఖం షూడకుండా షేష్తాను- మీ కాలనీ ఓళ్ళకసలు టీవీ ప్రోగ్రామ్స్ రాకుండా టీవీ టవర్‌లో మార్పులు షేషేస్తా!" అంటూ కింద పడిపోయాడు. అందరం కలసి అతనిని ఓ ఆటో పిలిపించి అందులో ఎక్కించాం.

"రేయ్- మా బామ్మర్దికి డైరెష్షన్ ఇవ్వనన్నారు కదూ! మీ షీరియల్ ఎలా బయటికొస్తుందో నేను షూష్తా!" అంటూ వెళ్ళిపోయాడతను.

"పోపోరా రమ్ బాటిల్" అరచాడు గోపాల్రావ్.

మర్నాడు షూటింగ్ అనుకున్నట్లే ప్రారంభమైపోయింది. బోస్‌బాబు తన సినిమా టెక్నిక్ అంతా ఉపయోగించి మొదటి ఎపిసోడ్ మూడు రోజుల్లో పూర్తి చేశాడు.

ఎడిటింగ్, మ్యూజిక్ వగైరాలు పూర్తయ్యేసరికి మరో నాలుగు రోజులు పట్టింది. సీరియల్ తాలూకూ మొదటి ఎపిసోడ్ కేసెట్ తీసుకుని అందరం టీవీ స్టేషన్‌కి చేరుకున్నాం. అప్పటికే శ్యామర్రావ్, వాళ్ళబ్బాయ్ రమణారావ్ టీవీ స్టేషన్లో నుంచి బయటికొస్తున్నారు.

"ఏమిటి? మీ మొదటి ఎపిసోడ్ ఇప్పుడు తెస్తున్నారా!" ఆశ్చర్యంగా అడిగాడు మమ్మల్ని చూసి.

"అవును- ఏం?"

"ఇంత స్లో అయితే ఎలా? నేను వారం రోజుల్లో అరడజను ఎపిసోడ్స్‌కి ఎడిటింగ్, మ్యూజిక్ అన్నీ పూర్తిచేసేశాను-"

అదిరిపడ్డాం అందరం.

"ఏడురోజుల్లో ఆరు ఎపిసోడ్స్ షూటింగ్ చేసేశారా?" నమ్మలేనట్లు అడిగాడు శాయిరామ్.

"మొత్తం పదమూడూ షూటింగు అయిపోయినయ్ అనుకోండి- ఎడిటింగ్ మ్యూజిక్ మాత్రం ఆరింటికి పూర్తి అయింది. వాటన్నిటిని టీవీ వాళ్లు ఒ.కే. చేసేశారు కూడా! రేపే బాంబేవెళ్లి మాంచి స్పాన్సరింగ్ కంపెనీని పట్టుకుని అమ్మేసి వస్తాం-'' అంటూ వెళ్ళిపోయారు వాళ్ళు.

వేమంతా బోసుబాబు వేపు చూశాం అనుమానంగా. బోసుబాబు కంగారుపడిపోయాడు.

"అలా చూడకండి గురూ! వాడెలా తీశాడో నాకు తెలీదు గానీ ఎపిసోడ్‌కి కనీసం రెండురోజులయినా షూటింగు జరగాలి. లేపోతే స్టేజ్ డ్రామాలాగా అయిపోతుంది- మన స్క్రిప్ట్‌లో కొంచెం లొకేషన్స్ ఎక్కువ కాబట్టి ఇంకో రోజు ఎక్కువ పట్టింది-" అన్నాడు సమర్థించుకుంటూ.

"మీ కాసెట్‌ని మా దూరదర్శన్ కమిటీ వాళ్లు చూసి అందులో లోపాలేమీ లేకపోతే ఓ.కే. చేస్తారులెండి! పదిరోజుల తర్వాత కనిపించండి-"

పదిరోజుల తర్వాత అందరం మళ్ళీ టీవీ స్టేషన్ కెళ్ళాం.

"వచ్చేశారా? వెరీగుడ్! ఇప్పుడే మీకు లెటర్ పోస్ట్ చేద్దామనుకుంటున్నాం! ఇదిగో మీ లెటర్-" అంటూ ఓ లెటర్ మా చేతికిచ్చాడు.

అందరం గుమికూడి చదివాం.

1. ఆర్టిస్ట్‌ల నటన బాగుండలేదు.

2. కొన్ని పాత్రలు ఉపయోగించిన కొన్ని పదాలు బాగుండలేదు.

3. మ్యూజిక్ బాగోలేదు.

అందరికీ ఆ కాగితం చదివేసరికి వళ్లు మండిపోయింది.

"ఆర్టిస్ట్ నటన మీకు నచ్చలేదా? ఆ మాటంటానికి మీరెవరు? మీ టీవీలో నటనలో డిప్లమాలు తీసుకున్న వాళ్ళుగానీ, ఆంధ్రప్రదేశ్ అంతటా గొప్ప నటుడుగా గుర్తింపు పొందిన వారు గానీ ఉన్నారా?" అడిగాడు శాయిరాం కోపంగా.

అధికారి మండిపడ్డాడు.

"మీకు లక్షసార్లు చెప్పాను- గవర్నమెంట్‌నీ, టీవీ అధికారులనూ ప్రశ్నించే అధికారం ఎవ్వరికీ లేదని! మళ్లా ఎందుకలా అరుస్తున్నారు?"

అందరం సైలెంటయిపోయాం.

గోపాల్రావ్ నెమ్మదిగా కల్పించుకున్నాడు.

"ఆర్టిస్టుల నటన సంగతి అలా వదిలేయండి సార్! పాత్రలు మాట్లాడిన కొన్ని మాటలు అభ్యంతరకంగా ఉన్నాయన్నారు-"

"అవును ఉన్నాయ్-"

"స్క్రిప్ట్ మీరే మంజూరు చేశారుకదండీ!"

"చేశాం! కాదని ఎవరన్నారు?"

"మరి మీరు అంగీకరించిన స్క్రిప్ట్‌కే మీరు ఎందుకు అభ్యంతరం చెప్తున్నారు?"

"ఆ మాత్రం కామన్‌సెన్స్ లేదయ్యా! స్క్రిప్ట్ చదివేవాళ్ళు వేరు- అది వీడియో సినిమాగా తీశాక చూసే కమిటీ మెంబర్లు వేరు- అంచేత ఎవరి టేస్ట్ వాళ్ళది- మధ్యలో ప్రశ్నించడానికి మీరెవరు?

గోపాల్రావ్‌కి కోపం వచ్చింది.

"ఆల్‌రైట్ ఈ విషయం మేం దూరదర్శన్ డైరెక్టర్ గారితో మాట్లాడదల్చుకున్నాం-"

"అయితే వచ్చేనెల పదహారో తారీఖురండి-"

"అదేమిటి? ఇప్పుడెందుకు మాట్లాడకూడదు?"

"ట్రాన్స్‌లేటర్ లేడిప్పుడు! వచ్చే నెల పదహారో తారీఖునే వస్తాడతను–"

అందరం మొఖాలు చూసుకున్నాం మళ్ళీ.

"ట్రాన్స్‌లేటరా? ట్రాన్స్‌లేటరేమిటి?"

"అదేనయ్యా– స్టేషన్ డైరెక్టర్‌తో మీరెలా మాట్లాడగలరు? ఆయన భాష. మీకు తెలీదు, మీ భాష ఆయనకు తెలీదు. అందుకని అనధికార పూర్వకంగా ఓ ట్రాన్స్‌లేటర్‌ని ఏర్పాటు చేశాం! ఆ ట్రాన్స్‌లేటర్ ఒక్కడికే ఖగోడీ భాషవచ్చు–"

"ఖగోడీ భాషెందుకు రావటం!"

"స్టేషన్ డైరెక్టర్ మరి ఖగోడీకి చెందినవాడు గనుక! ఆ మాత్రం కామన్‌సెన్స్ లేదా మీకు?"

"బాబ్బాబు– ఇప్పుడు మమ్మల్నేం చేయమంటారో చెప్పండి!'

"అలా దారికి దండి! రూల్సూ, కోర్టులూ అంటే మీ సీరియల్ మొదటి భాగం పట్టుకుని మా స్టేషన్ చుట్టూ, కోర్టు చుట్టూ తిరిగి రిటైరైపోతారు. మీరు ఈ షూటింగ్ కోసం ఇంతవరకూ చేసిన ఖర్చు కూడా గోవిందా గోవిందా–" మాకు భయం వేసింది.

"అంటే ఇప్పుడు మళ్ళీ షూటింగ్ చేయక తప్పదంటారా?"

"తప్పదయ్యా! తప్పదన్నాక తప్పదు–"

"పోనీ మార్పులు షూటింగ్ చేసుకొచ్చాకయినా ఇంకేట్రబులూ లేకుండా ఓ.కే. చేస్తారా?" అడిగాడు జనార్ధన్.

అధికారి కోపంగా లేచి నిలబడ్డాడు తన సీట్లో నుంచి.

"ఏయ్– ఇక్కడ్నుంచి పోతారా లేదా?"

"ఎందుకండీ అంతకోపం? మా వాడు పొరపాటు మాట్లాడితే చెప్పండి వింటాడు" అన్నాడు రంగారెడ్డి.

"లేకపోతే ఏమిటయ్యా! మా రూల్స్ వారానికోసారి మారిపోతుంటాయ్. మరప్పటి సంగతి ఇప్పుడెలా చెప్పమంటారు? ఇవాళ "ఓర్నాయనో" అన్నపదం మీరు మీ సీరియల్లో ఎక్కువగా వాడారు. అయినా మేమేం అభ్యంతరం చెప్పటం లేదు. రేపు గైడ్‌లైన్స్ మారి అదే మాకు చిరాకు కలిగించవచ్చు– అప్పుడు అది తీసేయమని మేము డిమాండ్ చేయవచ్చు–"

మేం ఇంక చేసేదిలేక వెనక్కు తిరిగాం.

బయట గేటు దగ్గరే నిలబడి ఉన్నాడా లావుపాటి వ్యక్తి. మమ్మల్ని చూసి తూలుతూ దగ్గరకొచ్చాడు.

"ఏయ్– మర్యాదగా డైరెక్షన్ మా బామ్మరిదికియండ్రా అంటే ఫోజులు కొడతారా! అదసలు టీవీలో ఎలా వస్తుందో చూస్తా ఆహాహాహా– ఆహాహాహా మాకు అప్పుడు అర్థమయింది. మా ఎపిసోడ్‌కి ఏవేవో వంకలు పెట్టి ఎందుకు రిజెక్ట్ చేసిందీనూ.

"బాస్– మనం ఇలా ఊరుకుంటే లాభం లేదు– ముందు వీడ్ని చట్నీ చేసేస్తాను–" అన్నాడు చంద్రకాంత్ ముందుకి దూకుతూ.

"అవ్ అన్నా– సాలేకో– ఖతమ్ కర్‌దేంగే" అన్నాడు యాదగిరి.

అందరం కాలనీకి తిరిగివచ్చాం.

శ్యామ్రావ్ మా కోసమే ఎదురుచూస్తూ కనిపించాడు.

"ఏమిటి– మీ ఎపిసోడ్ రిజెక్ట్ అయిందటగా?" హేళనగా అడిగాడు.

"అవును– ఎంత బాగా తీసినా రిజెక్ట్ చేశారు."

"పిచ్చివాళ్ళల్లారా! మీరెప్పుడూ ఆలస్యమే! అన్నిట్లోనూ వెనుకబడటమే! నా మాట విని నన్ను మీ ఏజెంటుగా పెట్టుకోండి. మీ ఎపిసోడ్ రెండురోజుల్లో ఓ.కే. చేయిస్తాను– నాకు పాతికవేలు కమిషన్ ఇవ్వండి చాలు–" అన్నాడు శ్యామ్రావ్.

"నీకు పాతికవేలు కమిషన్ ఇవ్వాలా?"

"మీ ఇష్టం! బలవంతమేం లేదు. మీరు ఖర్చు చేసిన ముప్పయ్ వేలూ సద్వినియోగం అవాలంటే తప్పదు మరి!

"అంటే క్వాలిటీతో పనిలేదా?"

"ఇదిగో చూడండి! ఇక్కడ బోడి క్వాలిటీ ఎవరికి అఖ్ఖర్లేదు. అందరికీ డబ్బు కావాలి! ప్రొడ్యూసర్‌గా మీరు, శాంక్షన్ చేసే వాళ్ళుగా టీవీ కమిటీ మెంబర్లు, దానిని స్పాన్సర్ చేసే కంపెనీ వాళ్ళు, దూరదర్శన్‌వాళ్ళూ, ఆ ప్రచారాన్ని అమ్మే ప్రభుత్వం, అందరికీ డబ్బే అవసరం! ఇంతమందికి డబ్బు అవసరమయిప్పుడు చూసే వాళ్ళ గొడవ మనకెందుకు? చూస్తాడు. లేకపోతే ఛస్తాడు–"

అతను చెప్పినట్లుగానే– రెండు రోజుల్లో ఎలాంటి మార్పులు లేకుండానే, కొంచెం డబ్బింగ్‌తో– ఎపిసోడ్‌ని ఓకే చేశారు.

తరువాతి ఘట్టం బాంబేలోనే జరుగుతుందని మాకు తెలుసు.

అందుకని నేనూ, రంగారెడ్డి, జనార్ధన్, శాయిరాం బాంబే చేరుకున్నాం. ఎడ్వర్టయిజింగ్ ఏజెన్సీల వాళ్ళ చుట్టూ పదిహేను రోజుల పాటు తిరిగాం.

"మీ ఎపిసోడ్ మేం కొంటే మాకెంత కమిషనిస్తారు?" అడిగాడు ఒక కంపెనీలో అధికారి.

"అదేమిటి? మీక్కూడా కమిషన్ ఇవ్వాలా?"

"అవును మరి! తెలుగు టీవీ సీరియల్స్ క్వాలిటీ ఎలా వుంటుందో మాకు తెలుసు. అలాంటి చెత్త టాటా బిర్లా లాంటి పెద్ద పెద్ద కంపెనీలతో కొనిపించాలంటే కొంచెం రిస్క్ కదా మాకు! మీ శ్యామ్రావే మాకు పాతికవేల రూపాయలు బహుమతిగా ఇచ్చాడు. ఇప్పుడు చూడండి ఆయన తీసిన సీరియల్స్ అన్నీ వారానికి యాభైవేల చొప్పున అమ్మేసి

పెట్టాను."

వాడికి పాతిక వేలివ్వటానికి కాదుగానీ, ఇలా లంచాల ఊబిలో దిగబడిపోవటం నచ్చలేదు మాకు. మరో నెలరోజులు వివిధ కంపెనీలకు, ఎడ్వర్టయిజింగ్ ఏజెన్సీలకూ తిరిగి ఎక్కడా మా సీరియల్ అమ్ముడుబోక తిరుగు ముఖం పట్టాం.

ఆ తరువాత వారం నుంచే శ్యామ్రావ్ సీరియల్ ప్రారంభమయింది టీవీలో.

మా వాళ్ళందరం దానిని అతి విషాదంగా చూశాం.

ఎందుకంటే అంతవరకూ "పరమచెత్తగా" ఉన్నాయని విమర్శించిన ప్రభుత్వ డ్రామాలే ఎంతో ఉత్తమంగా అనిపించసాగినయ్.

ఆ తరువాత శ్యామ్రావే వచ్చాడు మా దగ్గరకు.

"మీ సీరియల్ మాకు అమ్మేయండి" దాని మిగతా భాగమంతా నేనే షూటింగ్ చేసే రిలీజ్ చేస్తాను–మీకు ఇంతవరకు అయిన ఖర్చు మాత్రం ఇచ్చేస్తాను–" అన్నాడతను.

ఆ రాత్రి అందరం స్టేజ్ దగ్గర సమావేశమయాం.

ఆ సీరియల్ శ్యామ్రావ్ కిచ్చేసి మా డబ్బు మేం సంపాదించుకోవటమా లేక అతని ఆఫర్ తిరస్కరించడమా అనే విషయం మీద తర్జనభర్జనలు జరిగాయ్.

చివరకు అందరం ఏకగ్రీవంగా నిర్ణయించుకున్నాం.

సీరియల్ని శ్యామ్రావ్కి అమ్మి మరో దారుణమయిన చెత్తను ప్రజలమీద రుద్దటం కంటే ముప్పయ్వేలు నష్టం భరించి దానిని తగలబెట్టటం మంచిదని!

అదేరాత్రి చలిమంటలో టీవీ సీరియల్ కాసెట్ మసి అయిపోయింది. అది బొగ్గుగా మారి పోతూంటే మా అందరికీ కళ్ళ వెంబడి నీళ్ళు తిరిగినయ్. అయినా లోలోపల సంతృప్తి మాత్రం నిండిపోయింది– మేము ఓ మంచి పనిచేశామని.

(తెలుగోళ్ళకు టీవీ ప్రసారాలు మొదలుపెట్టిన కొత్తలో వ్యవహారం ఈ కథ)